క్లుప్తంగా

ఎమ్మెల్యేపై అనుచిత పోస్టులు: కేసు నమోదు

బిజినేపల్లి: మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పెట్టిన పోస్టులపై గురువారం ఎస్‌ఐ కృష్ణ ఓబులరెడ్డి కేసు నమోదు చేశారు. మండలానికి చెందిన వంశీనాయక్ ఫిర్యాదు మేరకు భరద్వాజ్‌గౌడ్, నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్‌ఐగా రాజు బాధ్యతలు

కోడేరు: మండల ఎస్‌ఐగా రాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు.

పార్కు ఏర్పాటుకు భూమిపూజ

కొల్లాపూర్: పట్టణంలోని బండాయిగుట్ట వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద పార్కు ఏర్పాటుకు మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి గురువారం భూమిపూజ చేశారు. రూ.1.40 కోట్ల వ్యయంతో పార్కు పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రహీంపాష, కోఆప్షన్ సభ్యుడు రుక్మద్దీన్, ఏఈ విద్యాసాగర్‌రెడ్డి, దశరథం, పాష, హుస్సేన్ తదితరులున్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సేవలు

లింగాల: ప్రయాణికుల సౌకర్యార్థం కొల్లాపూర్ డిపో అధికారులు కొల్లాపూర్ నుంచి వయా నార్లాపూర్, లింగాల ద్వారా అచ్చంపేటకు గురువారం నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. ఈ బస్సు ప్రతి రోజు ఉదయం 7 గంటలకు కొల్లాపూర్ నుంచి బయలుదేరి అంబట్‌పల్లి, లింగాల ద్వారా 9 గంటలకు అచ్చంపేటకు చేరుకుంటుందని, తిరిగి అచ్చంపేటలో ఉదయం 9:20 గంటలకు బయలుదేరి 11.20 గంటలకి కొల్లాపూర్‌కు చేరుకుంటుంది. మధ్యాహ్నం 1:20 గంటలకు కొల్లాపూర్ నుంచి బయలుదేరి 3:20గంటలకు అచ్చంపేటకు అటు నుంచి 3:40కి బయలుదేరి 5:40కి కొల్లాపూర్‌కు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

క్రీడలకు సహకరిస్తాం

కల్వకుర్తిరూరల్: క్రీడాకారులకు ఎల్లప్పుడూ ఐక్యతా ఫౌండేషన్ సహకారం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మార్చాలలో నిర్వహిస్తున్న మార్చాల ప్రీమియర్ లీగ్–2 పోటీలను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గోవర్ధన్, కృష్ణారెడ్డి, బాలయ్య, నిజాముద్దీన్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోండి

తెలకపల్లి: వేసవి శిక్షణను విద్యార్థులు వినియోగించుకోవాలని కేకేరెడ్డి పాఠశాల ప్రిన్సిపాల్ బాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పాఠశాలలో స్వర్ణమారతి కళానిలయం ఆధ్వర్యంలో వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరం ప్రారంభించారు. 35 రోజుల పాటు శిబిరంలో కూచిపూడి, జానపద, పాశ్చాత్యా నృత్యాలతో పాటు లలిత, జానపద సంగీతంలో శిక్షణ ఇస్తారని తెలిపారు.

కల్వకుర్తి: విద్యార్థులు నృత్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కోరారు. స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో వేసవి సంగీత నృత్య శిబిరాన్ని చైర్మన్, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహెద్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, చెన్నకేశవులు, రవీందర్ రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన వివాహిత బరిగెల శైలజపై అదే గ్రామానికి చెందిన పరిమెళ యాదగిరి బుధవారం సాయంత్రం దాడిచేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గురువారం అతనిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. యాదగిరి తనకు తరుచుగా ఫోన్ చేస్తుండటంపై తాను నిలదీయడంతో బూతులు తిడుతూ దాడి చేసినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెల్దండ: మండలంలోని మర్రిగుతండా పంచాయతీ పరిధిలోని సిన్యాతండాకు చెందిన కిషన్ కుటుంబ సభ్యులపై ఈనెల25న పాత కక్షలతో రంగారెడ్డి జిల్లా కొరింతకుంట తండాకు చెందిన రవి, దేవుజ, తేజ సక్రు, శివ దాడిచేశారు. గురువారం సిన్యాతండాకు చెందిన కిషన్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

అచ్చంపేట రూరల్: నిరక్షరాస్యులుగా ఉన్న మహిళా సంఘం సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా వయోజన ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాస్యత– అభ్యసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక మహిళా అక్షరాస్యత కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, చదువుకున్న మహిళలను వలంటీర్లుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, ఏపీఎం విజయ, సీసీలు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



కల్వకుర్తిలో నివాళి అర్పిస్తున్న నాయకులు



పెద్దకొత్తపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

కొల్లాపూర్: భగీరథ మహర్షి జయంతిని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సగర సంఘం నాయకులు భగీరథుని చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, కురుమూర్తి, రెడ్డి ప్రభాకర్, ప్రసాద్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: కొత్తపేటలో భగీరథ మహర్షి జయంతిని గురువారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సుధాకర్, జనార్దన్, సురేష్, నాగేష్, నాగరాజు, కుమార్, మల్లేష్, సాయిబాబా, విష్ణు, రాఘవులు పాల్గొన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గురువారం భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. భగీరథ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో గురువారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, వెంకటయ్య, కుర్మయ్య, లక్ష్మణ్, సాయి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నేరేళ్లపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలో 13 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు రాందేవ్ గురువారం తెలిపారు. గురువారం నేరేళ్లపల్లిలె కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

లింగాల: ధాన్యానికి గిట్టుబాటు ధర చెల్లించడమే ప్రభుత్వ లక్ష్యమని సింగిల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి అన్నారు. పీఏసీఎస్ ద్వారా నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం లింగాల, అంబట్‌పల్లిలో ఆయన ప్రారంభించారు. మండలంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి రకం ధాన్యానికి రూ.2,060, రెండవ రకానికి రూ.2,040 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల, ఎల్లూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ భాగ్యమ్మ, సర్పంచ్‌లు బండి లక్ష్మీదేవమ్మ, కొండ్ర జ్యోతి ప్రారంభించారు.

వంగూరు: రంగాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి ప్రారంభించారు.

సభను విజయవంతం చేద్దాం

వెల్దండ: మండల కేంద్రంలో దళితశక్తి ప్రోగ్రామ్ మండల అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో గురువారం విశారదన్ మహారాజ్ ముగింపు సభ పోస్టర్‌ను విడుదల చేశారు. హైదరాబాదులోని సరూర్ నగర్ క్రీడా మైదానంలో ఈనెల 30న పాదయాత్ర ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

చారకొండ: 10వేల కి.మీ. స్వరాజ్యపాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని డీఎస్పీ మండల అధ్యక్షుడు విజయ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ముగింపు సభ పోస్టర్‌ను విడుదల చేశారు.



చారకొండలో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తే అడ్డుకుంటాం

నాగర్‌కర్నూల్ రూరల్: రాబోయే రోజుల్లో ఎస్సీ వర్గీకరణ అంశం ఏ రాజకీయ పార్టీ లేవనెత్తినా వారికి తగిన గుణపాఠం చెబుతామని మాలమహానాడు నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 59 ఉపకులాల ఐక్యత కోసం మాల మహానాడు పనిచేస్తుందని, గ్రామ స్థాయిలో కులవివక్షత చూపుతున్న కొంత మంది రాజకీయ నాయకులు, అంటరానితనాన్ని పాటించే వారికి మతం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ఏ ఒక్క రాజకీయ పార్టీ అయినా ఉన్నత వర్గాలకు ఇబ్బంది అయితే తక్షణమే స్పందించి చర్యలు చేపడుతారు కానీ దళితులు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో దళితులకు అన్యాయం జరిగితే దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజకీయ నాయకులెవ్వరూ కూడా స్పందించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అలాంటి వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ గురించి ఏ పార్టీ మాట్లాడినా పార్టీని భూస్థాపితం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆంజనేయులు, మల్లేష్, రవి, వెంకటయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్‌ను చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం గతేడాది మున్సిపల్ కార్మికులకు పెంచిన ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ గతేడాది మున్సిపల్ కార్మికులకు ఏరియర్స్ పెంచాక ఇప్పటి వరకు వాటిని చెల్లించకుండా కార్మికులతో పని చేయిస్తున్నారని ఆరోపించారు. టెక్నికల్, నాన్‌టెక్నికల్ తేడా లేకుండా అందరికీ సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మరోవైపు కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సక్రమంగా అమలు చేయకుండా ఎవరికి ఎంత పీఎఫ్ వస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు భీముడు, వెంకటయ్య, బాలరాజు, కుర్మయ్య, చంద్రయ్య, వెంకటేష్, బాలస్వామి, లక్ష్మమ్మ, రాములమ్మ, వెంకటమ్మ, అలివేల, మాసమ్మ, కవిత, సునీత, శంకరమ్మ పాల్గొన్నారు.

పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలి

అచ్చంపేట రూరల్: కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం, బహుజన మహాసభ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎంఎం గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ భవనం వద్ద 132 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ పార్టీ నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి గొప్పగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆనంద్, పెంటయ్య, మహేంద్రనాథ్, పరమేష్, శ్యామ్, వెంకటస్వామి, ప్రభాకర్, పర్వతాలు, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.



ఐక్య నినాదం చేస్తున్న నాయకులు

ప్రాణాలు కాపాడటానికే సీపీఆర్ శిక్షణ



కల్వకుర్తిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కల్వకుర్తి టౌన్: అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం అన్నారు. గురువారం ఆస్పత్రికి వచ్చిన రోగులతో పాటుగా, వైద్యులు, సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. విధిగా సీపీఆర్‌పై అవగాహన పెంచుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వైద్యులు తెలిపారు. వైద్యులు మాత్రమే చేయాల్సిన పనిలేదని, సామాన్య ప్రజలు కూడా అవగాహన ఉంటే సీపీఆర్ చేయవచ్చని తెలిపారు.

అచ్చంపేట రూరల్: ప్రస్తుత కాలంలో చాలా మంది గుండెపోటుతో చనిపోతున్నారని, అలాంటి వారి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో ప్రభుత్వం సీపీఆర్ శిక్షణ ఇస్తుందని సిద్దాపూర్ వైద్యులు బిక్కులాల్, శివశంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సిద్దాపూర్ పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వైద్యులు మాట్లాడుతూ.. శారీరక శ్రమ లేకపోవడంతో అనేక రోగాలు వస్తున్నాయన్నారు. సీపీఆర్‌తో 10 మందిలో ఐదుగురు బ్రతికే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అశోక్‌ప్రసాద్, శ్రీనివాస్, బాలీశ్వరమ్మ, కమల, శాంత, భగత్ పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీపీఆర్‌పై డాక్టర్ విజయ్‌కుమార్, ప్రశాంత్, దశరథం, పంచాయతీ సిబ్బందికి, పోలీసుశాఖ, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కరోనా తర్వాత గుండెపోటు బాధితుల సంఖ్య పెరుగుతున్నందున తక్షణ సీపీఆర్ పద్ధతితో వారిని కాపాడే ప్రయత్నం చేయవచ్చన్నారు. అనంతరం 108కు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపించాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగర్‌కర్నూల్‌రూరల్: పెద్దకొత్తపల్లి మండలం చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన తిప్పరాజుకు కుటుంబానికి రూ.50 వేల చెక్కును గురువారం కలెక్టరేట్‌లో అందించినట్లు అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీన విద్యుదాఘాతంతో తిప్పరాజు ల్యాండ్రీ దుకాణం కాలిపోయింది. దీంతో బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి, శ్రీధర్, జనార్దన్ పాల్గొన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ

వెల్దండ: మండలంలోని కేస్లీతండాలో అడవి జంతువు దాడిలో గతేడాది ఆవుదూడ మృతి చెందింది. డీఎఫ్ఓ రోహిత్ ఆధ్వర్యంలో బాధిత రైతు కూంట్యాకు రూ.6వేలు మంజూరు చేశారు. గురువారం బాధిత రైతుకు చెక్కు అందజేశారు.

చారకొండ: మండల కేంద్రానికి చెందిన వెంకటమ్మ సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.30 వేల చెక్కును గురువారం ఎంపీ రాములు అందజేశారు.

మన్ననూర్: గ్రామానికి చెందిన కందికొండ పెద్ద బాలస్వామికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.42,500చెక్కును బాధితుని కుమారుడు భాస్కర్‌కు సర్పంచ్ నేనావత్ శ్రీరాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అందజేశారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వంగూరు: ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థలాలు ఉన్నవారికి రూ.3 లక్షలు చెల్లించాలన్నారు.

‘తెలంగాణ భరోసా’ సభకు తరలిరండి

నాగర్‌కర్నూల్ రూరల్/తెలకపల్లి/కొల్లాపూర్/కల్వకుర్తి రూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో తలపెట్టిన తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని నాయకులు కుమార్, పృథ్వీరాజ్, మోహన్‌రెడ్డి, పిలుపునిచ్చారు. గురువారం సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు పెద్ద మొత్తంలో తరలిరావాలని కోరారు. తెలకపల్లి మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కొల్లాపూర్‌లో అసెంబ్లీ అధ్యక్షుడు కృష్ణయ్య సభకు పోస్టర్లను అంబేడ్కర్ చౌరస్తాలో విడుదల చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో గురువారం వాల్‌పోస్టర్‌ను బహుజన నియోజకవర్గ అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో విడుదల చేశారు. వచ్చే నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించేసభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్నారని తెలిపారు.



జిల్లా కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

హక్కులు కాలరాస్తున్న పాలక ప్రభుత్వాలు



మాట్లాడుతున్న తిరుపతమ్మగౌడ్

కొల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని కాంగ్రెస్ నాయకురాలు తిరుపతమ్మగౌడ్ అన్నారు. టీయూటీఎఫ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో మేడే ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఖలీల్, గంగన్న హాజరయ్యారు. ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 8 గంటల పని సమయాన్ని 12 గంటలకు పెంచి కార్మికులపై కేంద్రం పనిభారం మోపుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు వత్తాసుగా కేంద్రం విధానాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, కర్ణ, రాంచందర్, శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులున్నారు.

మేడేను విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రపంచ కార్మికుల పండుగ మేడేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. గురువారం తెలంగాణ మెడికల్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారి సమస్యలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక లక్ష్మణాచారి భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యారని కనీసం పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలన్నారు. రాష్ట్రంలో అధిక ఫీజుల వల్ల ఎంతో మంది పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్, పట్టణ కన్వీనర్ శ్రీధర్, వరుణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుగౌడ్

ఉపాధి హామీ పనులు, నర్సరీల పరిశీలన

మన్ననూర్: ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతుల వ్యవసాయ పొలాల్లో చేపట్టిన ఫీడర్ ఛానల్ పనులను ఎంపీడీఓ రామ్మోహన్ బుధవారం పరిశీలించారు. మన్ననూర్‌లోని ఉమామహేశ్వర కాలనీలోని రైతు పొలాలతో పాటు ప్రశాంతినగర్ గ్రామంలో నిర్వహణలో ఉన్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

కల్వకుర్తిరూరల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. గురువారం మండలంలోని సుద్దకల్‌లో నర్సరీలను పరిశీలించారు. అనంతరం వేపూరులో ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు.

మారుమూల గ్రామాలకు తపాల సేవలు

పెద్దకొత్తపల్లి: మారుమూల గ్రామాలలో తపాల సేవలు విస్తరింపజేస్తున్నామని వనపర్తి పోస్టల్ అధికారి దేవిరెడ్డి సిద్దార్థ అన్నారు. గురువారం వేడుకరావుపల్లితండాలో బ్రాంచ్ పోస్టు కార్యాలయాన్ని జెడ్పీటీసీ గౌరమ్మ, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ మంగమ్మలతో కలిసి ప్రారంభించారు. మారుమూల ప్రాంతాలలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు తపాల సిబ్బంది సేవలు చేస్తున్నారన్నారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీధర్‌రావు, తపాలసిబ్బంది అభినవశర్మ, మురళీ, మహమ్మద్‌ఖాన్, షకీల్, బాలాజీ, గోపాల్‌రావు, లాలు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరిలో గ్రామీణ పోస్టాఫీస్‌ను వనపర్తి పోస్టల్ సూపరింటెండెంట్ సిద్దార్థ ప్రారంభించారు. కృష్ణానది తీర ప్రాంతమైన అమరగిరిలో తపాలా సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నిరంజన్, ప్రజలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి

కల్వకుర్తి టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం, బాలామృతాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజనమ్మ, అలివేలు, విద్యావతి, సుజాత, పద్మ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి



తాడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలికి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గుంతకోడూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం దేశసంపదను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, సామాన్య ప్రజలు సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో శివశంకర్, వెంకటస్వామి, మధుగౌడ్, ఆంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి వీఓఏల నిరసన



లింగాలలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న వీఓఏలు

సాక్షి, నెట్‌వర్క్: సమస్యల పరిష్కారం కోరుతూ ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం మోకాళ్లపై నిలబడి నిరసనలు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని, తమ డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు పోరు ఆగదని తెలిపారు. ఇప్పటికే వీఓఏల సమ్మెకు పలు పార్టీలు, సంఘాలు మద్దతు తెలిపాయి.

పశువైద్య శిబిరం

బల్మూర్: మండలంలోని గోదల్‌లో గురువారం ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారులు వెంకటేశ్వర్లు, అఖిల్, మహేశ్వరి పశువులకు, గేదెలకు వచ్చే జబ్బులు, గొంతువాపు వ్యాధుల నిరోధక టీకాలతో పాటు వివిధ రోగాలకు చికిత్సలు చేశారు. పశువులలో వచ్చే దీర్ఘకాలిక గర్భకోశ వ్యాధులను గుర్తించి మందులను పంపిణీ చేశారు.

అర్హులందరికీ గొర్రెల యూనిట్లు

వెల్దండ: ప్రభుత్వ రెండో విడతలో అందిస్తున్న గొర్రెల యూనిట్లను అర్హులందరికీ అందిస్తామని పశువైద్యాధికారి శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ ఖాతాలను అందించాలన్నారు. కార్యక్రమంలో రాజుయాదవ్, వెంకటయ్యయాదవ్, తంబాలు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.